క్లుప్తంగా

అక్కినేని శతజయంతి వేడుకల్లో కోట్నికి సత్కారం


విశాఖలో కోట్ని సన్యాసినాయుడిని సన్మానిస్తున్న దృశ్యం

మాడుగుల రూరల్ : అక్కినేని శత జయంతి వేడుకల్లో భాగంగా సాగరం సర్పంచ్ కోట్ని జయమ్మ భర్త, అక్కినేని నాగేశ్వరావు అభిమాని అయిన సన్యాసినాయుడుని ఆదివారం రాత్రి విశాఖలో జరిగిన కార్యక్రమంలో ఘనంగా సన్మానించారు. విశాఖ ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో జరిగిన కార్యక్రమంలో అక్కినేని సీనియర్ అభిమాని అయిన సన్యాసినాయుడుని శ్రీ సీతారామయ్య స్మారక సమాజం నిర్వాహకులు కోనాడ వెంకట్రావు ఆధ్వర్యంలో సన్మానించి జ్ఞాపికలు అందించారు. కార్యక్రమానికి విశాఖ, అనకాపల్లి, జిల్లాల నుంచి అక్కినేని అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

చెరువులో పడి గేదె మృతి


గేదె మృతి చెందడంతో రోదిస్తున్న పడాల కొండమ్మ

మాడుగుల రూరల్: కూర్మానాథపురం చెరువులో పడి సోమవారం గేదె మృతి చెందింది. ఎం. కోడూరు గ్రామానికి చెందిన పడాల కొండమ్మకు చెందిన పాడిగేదె మేతకు వెళ్లి, కాలు జారి చెరువులో పడి మృతి చెందింది. ఈ ఘటనపై కొండమ్మ ఫిర్యాదు మేరకు ఎం. కోడూరు పశువైద్యాధికారి అరుణ కిరణ్ సంఘటన స్థలానికి వచ్చి వివరాలు తెలుసుకున్నారు. మృతి చెందిన పాడి గేదె ఖరీదు రూ.50వేలు ఉంటుందని అంచనా. ప్రమాద వివరాలపై వీఆర్వో, తహసీల్దార్, పశువైద్యశాఖ సహాయ సంచాలకులకు సమాచారం అందించామని పశు వైద్యాధికారి అరుణకిరణ్ తెలిపారు.

పూర్వ విద్యార్థుల అన్నసమారాధన


అన్నసమారాధనలో పాల్గొన్న భక్తులు

మాడుగుల రూరల్ : వినాయక నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా, కె.జె.పురం పవర్ టాలెంట్ యూత్ (పదో తరగతి పూర్వ విద్యార్థులు) ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి స్థానిక ఓం శాంతి భవనం వద్ద అన్నసమారాధన జరిపారు.

కిడ్నీ బాధితురాలికి వితరణ


బాధితురాలి కుమారుడికి నగదు అందిస్తున్న సీతయ్యపేట యువకులు

బుచ్చెయ్యపేట : సీతయ్యపేట గ్రామానికి చెందిన కిడ్నీ బాధితురాలికి స్థానిక యువకులు ఆర్థిక సహాయం అందించారు. గ్రామానికి చెందిన నానిపల్లి దుర్గమ్మ కిడ్నీ వ్యాధితో బాధపడుతూ మందులు కొనుగోలుకు ఆర్థిక ఇబ్బందులు పడుతుంది. దీంతో సీతయ్యపేట యూత్ యువకులు కలిసి రూ, 49,100 నగదును దుర్గమ్మ కుమారుడు నానికి సోమవారం అందించారు.

రేపు మెగా కంటి వైద్య శిబిరం

చోడవరం రూరల్ : స్థానిక శ్రీ గణేష్ గాయత్రి బ్రాహ్మణ సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో బుధవారం (రేపు) ఉచిత మెగా కంటి వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు సంస్థ అధ్యక్ష, కార్యదర్శులు పుట్రేవు శ్యామ్‌ప్రసాద్, వింజమూరి శంకర్ ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక కన్యకాపరమేశ్వరి దేవస్థానం వద్ద ఉన్న బ్రాహ్మణ భవనంలో శిబిరం నిర్వహిస్తామన్నారు.

టౌన్ సీఐగా గోవిందరావు

నర్సీపట్నం : నర్సీపట్నం టౌన్ సీఐగా జి.గోవిందరావును నియమిస్తూ డీఐజీ ఉత్తర్వులు జారీ చేశారు. గతంలో టౌన్ ఎస్ఐగా విధులు నిర్వహించారు. సీఐగా పదోన్నతి లభించడంతో విశాఖ నగరంలో పని చేస్తున్నారు. బదిలీపై నర్సీపట్నం సీఐగా నియమితులయ్యారు.


వి.సంతపాలెం నాగారాయుడు చెరువు అలుగుపై నుంచి ప్రవహిస్తున్న వర్షపునీరు


నీటిమునిగిన వరి పంటను పరిశీలిస్తున్న ఏడీఏ శ్రీదేవి


ఉత్తరవాహినిలో నీట మునిగిన స్నానపు ఘాట్లు


జోగునాథునిపాలెం పరిసర ప్రాంతాల్లో నీట మునిగిన వరి పొలాలు


ఉధృతంగా ప్రవహిస్తున్న వరహానది

వాన వెలిసాక...

- నీటిలోనే వరి పొలాలు
- పొంగి ప్రవహిస్తున్న వాగులు
- 71.43 హెక్టార్లలో నీటమునిగిన వరి పంట

నర్సీపట్నం : మూడు రోజులుగా కురిసిన భారీ వర్షాలకు బలిఘట్టం ఉత్తరవాహిని నది పరవళ్లు తొక్కుతుంది. బ్రహ్మలింగేశ్వరస్వామి ఆలయానికి వెళ్లే వంతెనను అనుకొని నది ప్రవహిస్తుంది. ఉత్తరవాహినిలో స్నానపు ఘాట్లు పూర్తిగా నీట మునిగాయి. నర్సీపట్నం పెద్ద చెరువులో వరదనీరు చేరడంతో పొర్లుకట్టు మీద నుంచి నీరు ప్రవహిస్తుంది. పెదబొడ్డేపల్లి చెరువు నీరు పొర్లుకట్టు మీద నుంచి పొంగి ప్రహిస్తుండడంతో కోటవురట్ల మెయిన్ రోడ్డు మీద నుంచి ప్రవహించింది. ఉదయం వాహన రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. జోగునాథునిపాలెం వద్ద వాగు ఉధృతికి పరిసర ప్రాంతాల్లోని వరి పొలాలు నీట మునిగాయి. నాతవరం మండలం, గన్నవరం మెట్ట వద్ద దొంగ గెడ్డ తుని వెళ్లే మెయిన్ రోడ్డు పై నుంచి ఉధృతంగా ప్రవహించడంతో తుని వెళ్లే ఆర్టీసీ బస్సులను రద్దు చేశారు. నర్సీపట్నం పోలీసులు బలిఘట్టం వై.జంక్షన్ వద్ద మోహరించి తుని వెళ్లే వాహనాలను మధ్యాహ్నం వరకు నియంత్రించారు.


రోలుగుంట ఆర్‌సీఎం చర్చ్ వద్ద గోతిలో నిలిచిపోయిన భారీ లోడు వాహనం

71.43 హెక్టార్లలో నీటమునిగిన వరి పంట

డివిజన్‌లో 71.43 హెక్టార్లలో పంట నీటమునిగిందని వ్యవసాయశాఖ ఏడీ టి.శ్రీదేవి తెలిపారు. వేములపూడి వద్ద ఏలేరు కాలువకు గండిపడి సమీపంలో ఉన్న 30 ఎకరాల్లో వరి పంట నీట మునిగిందన్నారు. పెదబొడ్డేపల్లి, బలిఘట్టం తదితర ప్రాంతాల్లో వరి పంట నీటమునిగినట్లు ప్రాథమికంగా అంచనా వేశామన్నారు.

పొంగి ప్రవహిస్తున్న గెడ్డలు

గొలుగొండ: మండలంలోని జోగుంపేట నుంచి అల్లూరి జిల్లా కొయ్యూరు మండలం చిట్టింపాడు వెళ్లే మార్గంలో జోగుంపేట సమీపంలో బోరింగ్‌గెడ్డ పొంగి ప్రవహిస్తోంది. దీని కారణంగా 25 గ్రామాల ప్రజలకు రాకపోకలు నిలిచిపోయాయి. ధారగెడ్డ పొంగడంతో 60 ఎకరాల్లో వరినీట మునిగింది. ధారగెడ్డ, బోరింగ్ గెడ్డ, గొర్రిగెడ్డ, బొడ్డేరు గెడ్డలు పొంగి తాండవ జలాశయానికి భారీగా వరదనీరు చేరింది. కరక సమీపంలో ఉన్న పాలగెడ్డ పొంగి ప్రవహించడంతో ఆరు గ్రామాల ప్రజలకు రాకపోకలు నిలిచిపోయాయి. ఎస్ఐ రామారావు గెడ్డల వద్ద బందోబస్తు ఏర్పాటు చేశారు. గొలుగొండ గురుకుల కళాశాలలో ఉన్న వసతిగృహంలోనికి నీరు చేరడంతో ప్రిన్సిపాల్ కోటేశ్వర్రావు విద్యార్థులను కళాశాలకు ఆదివారం రాత్రి తరలించారు.

బీఎన్‌రోడ్డులో భారీ వాహనాల పాట్లు

రోలుగుంట : బీఎన్ రోడ్డులో సోమవారం నాలుగన్నర గంటలు దాటిన తరువాత కొత్తకోట నుంచి వస్తున్న సరుగుడు కర్రలు భారీలోడుతో వస్తున్న వాహనం స్థానిక ఆర్‌సీఎం చర్చి వద్ద భారీ గోతిలో దిగబడిపోయింది. దీంతో గంటన్నర పాటు ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. గోతులతో ఉన్న ఈ రోడ్డు మధ్యలో ఈ వాహనం నిలిచిపోవడంతో చోడవరం, నర్సీపట్నం నడుమ రాకపోకలు సాగించే బస్‌లు నిలిచిపోయాయి.


కోటవురట్ల వెళ్లే మెయిన్ రోడ్డుపై నుంచి ప్రవహిస్తున్న పెదబొడ్డేపల్లి చెరువు నీరు

వర్షాలకు కూలిన ప్రహరీ గోడ

మాడుగుల రూరల్ : తుపాను వర్షాలకు మండలంలో ఎం.కోడూరు గ్రామంలో ఒక ఇంటి ప్రహరీ గోడ కూలిపోయింది. గ్రామ సమీపంలో గల చెరువు నీటితో నిండి పోయింది. దీనికి తోడు డ్రైనేజీల్లో చెత్త, పూడిక వల్ల వర్షపు నీరు లక్ష్మీనారాయణ ఆలయం పక్కన్న నిల్వ వుండిపోవడంతో ఈ ఇంటి ప్రహరీ గోడ నాని కూలిపోయిందని బాధితుడు పేర్కొన్నారు.

నిండుగా సాగునీటి చెరువులు

కె.కోటపాడు : భారీ వర్షాలకు గుల్లేపల్లిలో గల పెద్ద చెరువు నిండుకోవడంతో సమీపంలో ఉన్న మార్గం నుంచి పొలాల్లోకి పెద్ద ఎత్తున నీరు ప్రవహిస్తోంది. వి.సంతపాలెంలో గల నాగారాయుడు చెరువు నిండుకోవడంతో అలుపు పైనుండి వర్షపునీరు ప్రవహిస్తుంది. మండలంలో వారాడ, మేడిచర్ల, రొంగలినాయుడుపాలెం, పైడంపేట తదితర గ్రామాల్లో నీటి మునిగి ఉన్న పంటల పరిస్థితిని సోమవారం తహసీల్దార్ జె.రమేష్‌బాబు, ఏ.వో సోమశేఖర్, ఏఈవో లైలాదేవి పరిశీలించారు.

ముంపులో చోడవరం

చోడవరం : చోడవరంలో నాలుగు రోజుల్లో సుమారు 110 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. నియోజకవర్గంలో సుమారు 500 ఎకరాల్లో వరి, చెరకు పంటలు నీట మునిగాయి. చోడవరం పాత బస్టాండ్- చీడికాడ రోడ్డు, బాలాజీనగర్‌లో రోడ్లు, బానీకోనేరు, రెల్లివీధి, దుర్గాకాలనీ ప్రాంతాలను నీట మునిగాయి. రెల్లివీధిలో ఇళ్లల్లోకి నీరు వచ్చి చేరింది. మెయిన్‌రోడ్డపై ఆంధ్రాబ్యాంక్,ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద రోడ్డుపై నీరు నిలిచిపోయింది. బీఎన్‌రోడ్డులో గోవాడ, చోడవరం, విజయరామరాజుపేట, వడ్డాది ప్రాంతాల్లో పెద్దపెద్ద గోతులు పడడంతో వర్షపునీరు నిలిచిపోయి అనేక వాహనాలు ప్రమాదానికి గురయ్యాయి. విద్యుత్‌కు అంతరాయం ఏర్పడింది. నర్సయ్యపేట, కస్బాపొలాల్లోను, కన్నంపాలెం, జన్నవరం, పీఎస్‌పేట, చాకిపల్లి, ముద్దుర్తి, ఖండిపల్లి, దామునాపల్లి, మైచర్లపాలెం, లక్ష్మీపురం ప్రాంతాల్లో వరి, చెరకు పంటలు నీట మునిగాయి. లక్ష్మీపురం చెరువు పొంగి పొర్లిగట్టుపై నుంచి ప్రవహించడంతో ఈ గట్టుపై నుంచి పొలాల్లోకి వెళ్లే రైతులు ప్రాణాలు అరచేత్తో పట్టుకొని నీటిప్రవాహంలో గట్టును దాటుతున్నారు. ముంపు ప్రాంతాలను ఎంపీడీవో శ్యామ్‌సుందర్, తహసీల్దార్ తిరుమలరావు తమ సిబ్బందితో సందర్శించారు. పొక్లెయిన్‌లతో మెయిన్ కాల్వలకు పూడికలు తీయించి నీరు దిగువకు వెళ్లేలా చర్యలు చేపట్టారు.


వడ్డాది పెద్దేరు నది ఉధృతిని పరిశీలిస్తున్న ఆర్డీవో చిన్నికృష్ణ, ఆర్‌అండ్‌బీ ఎస్ఈ క్రాంతిమతి


చోడవరం : నీటమునిగిన కస్బా వరి, చెరకు పొలాలు


ఎం. కోడూరులో కూలిన ఇంటి ప్రహరీ


ధారగెడ్డ దిగువన నీటి మునిగిన వరి పంట

జలదిగ్బంధంలో మామిడిపాలెం ప్రజలు

మాడుగుల రూరల్ : తుపాను వర్షాలకు మామిడిపాలెం గిరిజన ప్రజలు జలదిగ్బంధంలో చిక్కుకున్నారు. శంకరం పంచాయతీ శివారు మామిడిపాలెంలో గ్రామానికి వెళ్లాలంటే ఉరకగెడ్డ దాటాల్సిందే. ఇటీవల కురుస్తున్న వర్షాలకు ఉరకగెడ్డ పొంగి ప్రవహించడంతో గ్రామస్తులు గ్రామం దాటి రాలేక పోయారు. సోమవారం వారపు సంతకు మాడుగులకు వెళ్తామంటే, ఉరకగెడ్డ ప్రవహం ఎక్కువ అయింది. ఎపి ఆదివాసీ గిరిజన సంఘం ఐదో షెడ్యూల్ సాధన కమిటీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఇరటా నర్సింహమూర్తి సోమవారం గెడ్డ దాటి గ్రామాన్ని సందర్శించారు. ఉరకగెడ్డ నీటి ప్రవాహం వల్ల గిరిజనులు గెడ్డ దాటలేక రెండు రోజులుగా రాకపోకలు స్తంభించి పోయాయని నర్సింహమూర్తి అన్నారు. ఈ గ్రామానికి బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలని, ఈ గెడ్డ పొంగి ప్రవహించడం వల్ల గ్రామస్తులు ఆకలితో పస్తులు వుంటున్నారని పేర్కొన్నారు. మండలంలో తాటిపర్తి పంచాయతీ శివారు అజయపురం, జాలంపల్లి పంచాయతీలో గొబ్బూరు, సిరిపురం, అవురువాడ పంచాయతీలో కొండవీధి, పెద గొర్రిగెడ్డ, చిన గొర్రిగెడ్డ, చీడికాడ మండలం, కోనాం పంచాయతీ శివారు రెల్లలపాలెం, గొడుగుమామిడి, చెరుకుపల్లి, మల్లిపాడు, జాజులపాలెం, బందవీధి, కొత్తవీధి గ్రామాల ప్రజలు ప్రతి గురువారం కోనాంలో జరిగే వారపు సంతకు రావాలంటే వర్షాకాలంలో ఇబ్బందులు తప్పడం లేదని, ఆయా గ్రామాలను ఎమ్మెల్యే, జిల్లా కలెక్టర్ సందర్శించి ప్రజల సమస్యలు పరిష్కరించాలని ఆయన కోరారు. ఆయన వెంట ఉండూరు ఈశ్వరావు, తార దేముడమ్మా, దారపర్తి బాలరాజు, సోమల సూకాలమ్మ పాల్గొన్నారు.


ఉరకగెడ్డ వద్ద శంకరం పంచాయతీ శివారు మామిడిపాలెం గిరిజనులు

నర్సీపట్నం, తుని మధ్య స్తంభించిన రాకపోకలు

నాతవరం: నర్సీపట్నవ తుని మధ్య గన్నవరం మెట్ట వద్ద వెదుళ్లగెడ్డ రోడ్డుపై పొంగి ప్రవహించడంతో ఆదివారం రాత్రి నుంచి సోమవారం మధ్యాహ్నం వరకు వాహనాలు రాకపోకలు నిలిచి పోయాయి. రెండు జిల్లాల సరిహద్దు గన్నవరం మెట్ట వద్ద వెదుళ్లగెడ్డ నీరు రోడ్డుపై పొంగి ప్రవహిస్తోంది. గతంలో ఈ ప్రాంతంలో నీటి ప్రవాహంలో పలు వాహనాలు కొట్టుకుపోయిన సంఘటనలో పలువురు మృతి చెందారు. ఈ దృష్ట్యా రెవెన్యూ అధికారులు, పోలీసులు ముందస్తు జాగ్రత్తలు చేపట్టారు. ఆదివారం రాత్రి నుంచి ఎస్ఐ రామారావు సిబ్బందితో కలిసి వాహనాలు రాకుండా నిలుపుదల చేశారు. నర్సీపట్నం తుని ఆర్టీసీ డిపోలకు సమాచారం ఇవ్వడంతో నర్సీపట్నం తుని రాకపోకలు సాగించే వారి కోసం తాళ్లపాలెం హైవే మీదుగా బస్సులు నడిపారు. వెదుళ్ల గెడ్డ నీటి ప్రవహం సోమవారం సాయంత్రానికి తగ్గడంతో వాహనాల రాకపోకలు పునరుద్ధరించారు.


వెదుళ్లగెడ్డ రోడ్డుపై ప్రవహించడంతో వాహనాలు నిలుపుదల చేస్తున్న ఎస్ఐ రామారావు

తెగుళ్ల బారిన పంటలు


మాడుగుల : పంటచేలకు పురుగు మందులు పిచికారీ


కొమరవోలులో దెబ్బతిన్న పంటలను పరిశీలిస్తున్న తహసీల్దార్ వరహాలు, ఏవో విజయలక్ష్మి


మాడుగులలో నీట ముంపునకు గురైన వరి చేలు

మాడుగుల : ఈ ఏడాది వరి నాట్లు సమయంలో వర్షాలు సక్రమంగా అనుకూలించకపోవడంతో వ్యవసాయ మోటార్లతో పాటు పంట చెరువులు, జలాశయం ఆయకట్టు ప్రాంతాల్లో అతి కష్టంమీద వరి నాట్లు వేసుకున్నారు. నాట్లు వేసిన 20 రోజులకే వర్షాలు అధిక మవ్వడంతో కలుపు పెరిగిపోయింది. పాము పొడ తెగుళ్లు ఆశిస్తున్నాయని రైతులు చెబుతున్నారు. తుపాను కారణంగా నియోజకవర్గంలో దాదాపు వెయ్యి ఎకరాల్లో వరి నీట మునిగింది. పల్లపు ప్రాంతాల్లో పంట నీట మునగగా, మెట్ట ప్రాంతాల్లో వరి చేలకు పాచి తెగుళ్లు ఆశించాయని రైతులు చెబుతున్నారు. కాగా తగిన రక్షణ చర్యలు చేపడితే పంటను కాపాడుకోవచ్చని మండల వ్యవసాయాధికారి ఎం.వాసుదేవరావు తెలిపారు. వరి నాట్లు వేసిన 30 రోజుల తర్వాత చేలుకు పాము పొడ తెగులు(పాచితెగుళు) ఆశించే అవకాశాలున్నాయని, దీని నివారణకు ముందస్తుగా సూడోమోనాస్ లీటరు నీటికి 5 గ్రాములు చొప్పున పిచికారీ చేయాలన్నారు. ఆకులపై మచ్చలు వస్తే అగ్గి తెగులు ఆశించే అవకాశాలున్నాయని, ముందుగా కలుపు లేకుండా చూసుకుని కార్బన్డిజమ్ 1 లీటరు నీటికి 2 మిల్లీలీటర్లు కలిపి పిచికారీ చేయాలన్నారు. పొలాల్లోని నీటిని బయటకు పంపించి 20 కిలోలు, యూరియా, 20 కిలోల పొటాస్ వేస్తే సరిపోతుందని తెలిపారు.

పంటనష్టం అంచనాల్లో అధికారులు

రోలుగుంట : భారీ వర్షాలకు దెబ్బతిన్న పంటలను, గృహాలను అధికారులు సోమవారం పరిశీలించారు. తహసీల్దార్ కె.వరహాలు, మండల వ్యవసాయాధికారి ఎస్.విజయలక్ష్మి పడాలపాలెం రెవెన్యూలో గల దెబ్బతిన్న రైతుల వరిపొలాలను పరిశీలించారు. వరిపొలంలో కుళ్లిన కాండం భాగాన్ని గుర్తించారు. కొమరవోలు ,అడ్డసరం రెవెన్యూలో దెబ్బతిన్న వరి పంటలను పరిశీలించారు. ఎంపీడీవో కె.ప్రభాకరరావు, వీఆర్వో శ్రీనివాసరావు, వ్యవసాయాధికారులు జానకీరాంపురం, కుసుర్లపూడిలో వరిపొలాలను పరిశీలించారు.

వరద ఉధృతికి బోట్లు ధ్వంసం


ఆదుకోవాలని కోరుతున్న బాధిత గిరిజనులు

దేవరాపల్లి : రైవాడ జలాశయంలో చేపల వేట సాగిస్తూ జీవనోపాధి పొందుతున్న పాతబొడ్డపాడు, కొత్తబొడ్డపాడు, లోవ ముకుందపురం గ్రామాలకు చెందిన గిరిజనుల చేపల వలలు, బోట్లు ధ్వంసమయ్యాయి. మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలతో రైవాడ జలాశయం వరద నీరు ఉధృతంగా ప్రవహించడంతో వలలు, బోట్లు దెబ్బతిన్నాయి. దీంతో వంద మందికి పైగా చేపల వేట సాగిస్తున్న జీవనోపాధి పొందుతున్న తమకు సుమారు రూ.10 లక్షల మేర ఆస్తి నష్టం వాటిల్లిందన్నారు. వలలు, బోట్లు దెబ్బతినడంతో ఉపాధి కోల్పోయిన తమను ప్రభుత్వం నష్టపరిహారం అందించి ఆదుకోవాలని వంతి నాయుడు, ముసలి తమ్మయ్య, వంతి ఎరకన్నదొర, జడ్డేటి రాము తదితరులు కోరారు.

అన్నదాతలను ఆదుకోండి

చోడవరం రూరల్ : వారం రోజులుగా ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షాలకు తీవ్రంగా నష్టపోయిన రైతులకు పంట నష్ట పరిహారాన్ని తక్షణం చెల్లించి ఆదుకోవాలని ఏపీ రైతు సంఘం అనకాపల్లి జిల్లా ప్రధాన కార్యదర్శి రెడ్డిపల్లి అప్పలరాజు డిమాండ్ చేశారు. సోమవారం మండలంలోని లక్ష్మీపురం, గాంధీగ్రామం, నర్సయ్యపేట, గౌరీపట్నం, అంకుపాలెం గ్రామాల్లో పర్యటించి రైతు ప్రతినిధులతో కలసి నష్టపోయిన పంట పొలాలను పరిశీలించారు. అధికారంలో ఉన్న కూటమి నేతలకు రైతుల ఆకలి కేకలు వినిపించలేదన్నారు. నేతలు, అధికారులు కళ్లు తెరచి పంట నష్టపోయిన రైతులను ఆదుకోవాలని, వారికి ఎకరాకు 30 వేల రూపాయల పంట నష్టం చెల్లించాలని డిమాండ్ చేశారు.

కోనాం నీటి విడుదల

చీడికాడ : కోనాం జలాశయం నుంచి నీటి విడదుల సోమవారం కూడా కొనసాగింది. జలాశయంలోకి ఇన్‌ఫ్లో 500 క్యూసెక్కులకు పెరగడంతో ముందస్తు చర్యల్లో భాగంగా ఆదివారం ఉదయం నుంచి 1000 క్యూసెక్కుల నీటి విడుదల కొనసాగిస్తున్నట్టు ఇరిగేషన్ ఏఈ జయరాం తెలిపారు. జలాశయం పూర్తి స్థాయి నీటిమట్టం 101.25 మీటర్లు కాగా సోమవారం మధ్యాహ్నానికి జలాశయం నీటిమట్టం 98.20 మీటర్లుగా కొనసాగుతుంది. జలాశయాన్ని ఇరిగేషన్ ఈఈ త్రినాథం మధ్యాహ్నం సందర్శించి ప్రధాన గేట్లు, మోటార్లు పరిశీలించారు.

శివారు గ్రామాల రోడ్డుకు ప్రతిపాదనలు


వాలాబులో అధికారులకు సూచనలిస్తున్న ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి

దేవరాపల్లి : మండలంలోని వాలాబు పంచాయతీ శివారు గిరిజన గ్రామాలకు రోడ్డు సదుపాయం కల్పించేందుకు కృషి చేస్తానని మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యన్నారాయణమూర్తి హామీ ఇచ్చారు. వారంరోజులుగా కురుస్తున్న వర్షాలతో శివారు గిరిజన గ్రామాల రహదారులన్నీ బురదమయంగా మారడంతో గిరిజనులు నానా అవస్థలు పడుతున్నారు. ప్రభుత్వం పట్టించుకోక పోవడంతో స్థానిక గిరిజనులు, సీపీఎం నాయుకులు కొన్ని రోజులుగా వరుసగా ఆందోళన చేపట్టగా, పత్రికల్లో వచ్చిన కథనాలపై ఎమ్మెల్యే స్పందించారు. వాలాబు పంచాయతీలో సోమవారం పర్యటించారు. గెడ్డ ఉధృతంగా ప్రవహించడంతో రాకపోకలు నిలిచిపోయిన బొర్రచింత పొలిమేర వరకు చేరుకొని కొందరు గిరిజనులతో మాట్లాడారు. బాధిత గిరిజన కుటుంబాలకు నిత్యావసర సరుకులను ఎమ్మెల్యే అందజేశారు. వాలాబు శివారు 8 గ్రామాల రోడ్ల నిర్మాణానికి అవసరమైన ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు.

ముంపు ప్రాంతాల్లో అధికారుల పర్యటన

మాకవరపాలెం : మూడు రోజులుగా కురిసిన వర్షాలకు లోతట్టు ప్రాంతాలైన తూటిపాల, గిడుతూరు, తామరం, జీకోడూరు గ్రామాల్లో వరి పంట నీట మునిగింది. ఈ నేపథ్యంలో సోమవారం స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ మనోరమ, తహసీల్దార్ ప్రసాద్, ఎంపీడీవో సీతామహాలక్ష్మి నీట మునిగిన పంటలను పరిశీలించారు. జీకోడూరులో జాగారం గెడ్డ కారణంగా పంటలకు రక్షణగా నిర్మించిన గోడ గత ఏడాది భారీ వర్షాలకు కొట్టుకుపోయింది. దీంతో గెడ్డ పక్కనే ఉన్న వరిపొలాల్లోకి భారీగా నీరు చేరడంతో పంట నీటమునిగిందని రైతులు అధికారులకు తెలిపారు. ఇక్కడ రక్షణకు మరమ్మతులు చేయాలని కోరారు. మండల వ్యాప్తంగా సుమారు 25 హెక్టార్లలో వరిపంటకు నష్టం వాటిల్లే అవకాశం ఉందని ఏవో చిరంజీవి తెలిపారు. నివేదికను ఉన్నతాధికారులకు అందజేస్తామన్నారు. ఏఈవో శేషు నాయుడు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.


జీకోడూరులో జాగారం గెడ్డ కారణంగా మునిగిన పంటను పరిశీలిస్తున్న అధికారులు

ఒంటి కాలిపై ఆస్పత్రి కార్మికుల నిరసన

మాడుగుల: స్థానిక 30 పడకల ఆస్పత్రి కార్మికులు ఏఐటీయూసీ అనుబంధ యూనియన్ ఆధ్వర్యంలో తమ సమస్యలు పరిష్కరించాలని, సోమవారం ఒంటికాలితో ఆస్పత్రి వద్ద నిరసన తెలియజేశారు. సంఘ ప్రధాన కార్యదర్శి కోన లక్ష్మణ మాట్లాడుతూ జిల్లాలో ప్రభుత్వ ఆస్పత్రుల్లో శానిటేషన్, పెస్ట్ కంట్రోలర్, వర్కర్లు, సెక్యూరిటీ సూపర్‌వైజర్‌లకు ప్రతి నెలా జీతాలు ఇవ్వాలన్నారు. ఉద్యోగ భద్రత కోసం శాంతియుతంగా ఉద్యమాలు చేపడుతున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడం దారుణమన్నారు. పెండింగ్ జీతాలన్నీ ఈ నెల 15వ తేదీలోపు ఇవ్వకపోతే ఆందోళన చేపడతామన్నారు. సంఘ నాయకురాలు రాజ్యలక్ష్మి, సభ్యులు పాల్గొన్నారు.

చోవరం రూరల్ : ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఏళ్ల తరబడి పనిచేస్తున్న కార్మికుల సమస్యల పరిష్కారాన్ని కోరుతూ సోమవారం ఆస్పత్రి ప్రాంగణంలో ఒంటికాలిపై నిలబడి ఆందోళన చేపట్టారు. నెలల తరబడి ఉన్న బకాయి వేతనాలు, పీఎఫ్ చెల్లింపులతోపాటు పలు సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఉమ్మడి విశాఖ జిల్లా ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి కోన లక్ష్మణ్ మాట్లాడుతూ కాంట్రాక్టర్ల చేతిలో ఆస్పత్రి కార్మికులు పడుతున్న వెతలను వివరించారు.


మాడుగుల: వినూత్న నిరసన చేపట్టిన కార్మికులు

కె.కోటపాడు : కాంట్రాక్ట్ విధానంలో పని చేస్తున్న స్టాఫ్ నర్స్‌లను రెగ్యులరైజేషన్ చేయాలని కె.కోటపాడు సీహెచ్‌సీ స్టాఫ్ నర్స్‌లు కోరారు. ఈ మేరకు సోమవారం ఆస్పత్రి ఎదుట నిరసన చేపట్టారు. స్టాఫ్ నర్స్ ధన రాజ్యలక్ష్మి మాట్లాడుతూ జీవో నంబర్ 115ను రద్దు చేయాలన్నారు. 15 ఏళ్లుగా పని చేస్తున్న తమను రెగ్యులర్ చేయడం వల్ల వందలాది మంది స్టాఫ్ నర్స్‌లకు ఉద్యోగ భద్రత కలుగుతుందన్నారు.

కల్వర్టు కూలి రోడ్డుకు గండి

చీడికాడ : ఖండివరం నుంచి మాడుగుల వెళ్ల రోడ్డులో ఖండివరం మోసూరి వారి కళ్లాలు వద్ద గల రోడ్డు మధ్యలో కల్వర్టు కూలి కొట్టుకుపోవడవంతో చీడికాడ నుంచి ఖండివరం మీదిగా మాడుగుల వెళ్లే రహదారిపై రాకపోకలు నిలచిపోయాయి. అల్పపీడన ద్రోణితో కురుస్తున్న భారీ వర్షాలతో పాటు కోనాం జలాశయం నీటి విడుదలతో కొండగెడ్డలు పొంగి ప్రవహిస్తున్నాయి. ఈ నేపథ్యంలో మోసూరి వారి కళ్లాలు వద్ద రోడ్డు మధ్యలో గల దెబ్బతిన్న కల్వర్టు కూలిపోయింది. ఈ మేరకు తహసీల్దార్ బి.వి.రాణి, ఎంపీడీవో జయప్రకాష్ తదితరులు పరిశీలించారు. గండిపడిన చోట రోడ్డును పూడ్చి రాకపోకలను పునరుద్ధరించేలా చూడాలని ఖండివరానికి చెందిన మాజీ చీడికాడ పీఏసీఎస్ అధ్యక్షుడు మోసూరి సన్నిబాబు అధికారులను కోరారు.


గండిపడిన రోడ్డు ప్రదేశాన్ని పరిశీలిస్తున్న అధికారులు